క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు నేడు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ బీవీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని పెద్దనెమలిపురి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మరియు, కోటనెమలిపురి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నకరికల్లు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.నాగసురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. 11కేవీ,13కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే వ్యవసాయ విద్యుత్ శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని రైతులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పార్లమెంట్‌పై ఆగంతకుల దాడికి నిరసన

పెదకూరపాడు: పార్లమెంట్‌పై ఆగంతకుల దాడికి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వంలో పార్లమెంట్‌కే రక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రధానమంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. దేశ భద్రత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పర ఉదయ్ కుమార్, షేక్ మైళి, గంటా తిరుపతిరావు, శివాజి, కోడె శివయ్య, రమేష్, మౌలాలిలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ళ: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని నార్నెపాడుకు చెందిన చెల్లి అనిల్‌కుమార్(19) మరో ముగ్గురితో కలిసి ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా నార్నెపాడు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డీ కిశోర్ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి దాతలు సహకారం అభినందనీయమని వేల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి, దూరపు ప్రాంతాల నుంచి నడిచి వచ్చే విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పూర్వ విద్యార్థులు తమవంతు సాయం చేశారన్నారు. పాఠశాల్లోని సోషల్ ఉపాధ్యాయులు చాగంటి శ్రీనివాసరావు విద్యార్థులు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల వ్యాయమా ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గుంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆరుగురు నిరుపేద బ్రాహ్మణులకు బియ్యం, సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా సంఘం తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భాగవతం జనార్ధనాచార్యులు, మంత్రిరాజు సత్యనారాయణ, గాలి శ్రీనివాసరావు, నారాయణం ఆనందాచార్యులు, కన్నెగంటి వెంకయ్య శర్మ, పుట్టంరాజు నారాయణ, భువనగిరి సుబ్రహ్మణ్యం, అప్పరాజు నాగేశ్వరరావు, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, కన్నెగంటి సూరిబాబు, దిలీఫ్, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు ఎ

పంట కోత ప్రయోగం

ఈపూరు : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు శాకమూరి రమేష్ వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా ఎకరాకు సుమారు 36 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేయడం జరిగింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏఎస్‌వో టి.మధుసూదనరావు పాల్గొని పంట కోత ప్రయోగాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగం చేయగా దిగుబడి ఆశాజనకంగా ఉందని తెలియజేశారు.

అమరజీవి ప్రాణత్యాగం మరువలేనిది

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు
- వాడవాడలా పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు



పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చల్లంచర్ల, నాయకులు



పట్టణంలోని గాంధీచౌక్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవి ఫ్యామిలీ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు

అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిదని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడై, మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. నాడు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు శ్రీరాములు చేసిన త్యాగం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, నాయకులు దేవతి సుబ్బారావు, తుమ్మల వెంకటేశ్వరరావు, దేవశెట్టి రవికుమార్, వల్లెం నరసింహారావు, షేక్ జానీ, కూకుట్ల శ్రీను, జూపల్లి పాల్, ఉల్లంగుల ప్రసాద్ బాబు, స్థానిక నాయకులు తదితరులున్నారు.

వాసవి ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో..

ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. సత్తెనపల్లి వాసవి ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీచౌక్‌లో అమరజీవి విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు మాట్లాడారు. ముందుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు అధ్వర్యంలో సంఘ నాయకుల చేతుల మీదుగా పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వాసవి ఫ్యామిలీస్ క్లబ్ బాధ్యులు కోట నాగవరలక్ష్మి, జవ్వాజి లక్ష్మి, రంగా రమాదేవి, రమాలక్ష్మి, అన్నపూర్ణ, రాధాకృష్ణమూర్తి, అచ్యుత శివప్రసాద్, విశ్వేశరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకట బసవయ్య, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరజీవి జీవితం ఆదర్శనీయం

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస వంటి ఆశయాల సాధనకు కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, అమరజీవి జీవితం నేటికీ ఆదర్శనీయమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని యువత అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, నాయకులు మల్లికార్జునరెడ్డి, షేక్ జానీ, వెంకటేశ్వరరావు, రవికుమార్, ప్రసాద్‌బాబు, సాయి, నరసింహారావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములకు నివాళి..

పెదకూరపాడు: స్థానిక జెడ్పీ పాఠశాలలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ భారతదేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి వల్లభాయ్ పటేల్ అన్నారు. దేశ తొలి ఉపప్రధానిగా, తొలి హోం మంత్రిగా విశేష సేవలు అందించారన్నారు. పొట్టి శ్రీరాముల త్యాగంతో తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. నేటి తరం యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అచ్చంపేటలో..

మండల కేంద్రమైన అచ్చంపేటలో పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనుమల శేషగిరిరావు, వీరవల్లి కిషోర్, ఏలూరి వాసు, ఆలపాటి జనార్ధన్‌రావు, మంచికంటి మధు, సురేష్, సాంబశివరావు, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



ముప్పాళ్ళలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ముప్పాళ్ళ: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, శ్రీరాం జగన్, పోతుగంటి నరసింహారావు, ఏవీఎస్ రంగనాయకులు, పల్లబోతు కోటేశ్వరరావు, రావిక్రింది రమేష్, అనుమాలశెట్టి శ్రీరంగనాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన కలాం చేయూత



సత్తెనపల్లి: కలాం చేయూత కార్యక్రమ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెలుగూరి శరత్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని 24వ వార్డుకు చెందిన చిన్ని సుధాకర్‌కు చిరువ్యాపార తోడ్పాటుకు నాలుగు చక్రాల తోపుడు బండిని వైఎస్సార్‌సీపీ నాయకులు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కలాం చేయూత కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించే ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తున్న వెలుగూరి శరత్‌ను అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, నాయకులు అవ్వారు శ్రీనివాసరావు, బండి మల్లికార్జునరెడ్డి, షేక్ జానీ, కాకుమాను రవి, వెంకటేశ్వరరావు, కూకుట్ల శ్రీను, రవికుమార్, జూపల్లి పాల్, ప్రసాద్ బాబు, నరసింహారావు ఉన్నారు.

గుండె వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం

పెదకూరపాడు: మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన చిన్నంశెట్టి మంజునాథ్ గత కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. దీంతో ఆర్థిక సహాయం అవసరమని తెలుసుకున్న మాగులూరు ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్ అందించిన రూ.25వేల ఆర్థిక సహాయం ఫౌండేషన్ సభ్యులు కుంచనపల్లి కిరణ్‌కుమార్, మాగులూరి కృష్ణారావులు శుక్రవారం అందించారు. ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అవసరమని తెలుసుకొని స్వయంగా విజయవాడ వెళ్లి అందించామన్నారు. మంజునాథ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మానవహక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



అమరావతిలోమానవహక్కుల దినోత్సవ ర్యాలీలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

అమరావతి: దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, వివక్ష, జాతీయ సమైక్యత, శాంతి వంటి అంశాలు మానవహక్కుల సాధన ద్వారానే సాధ్యమని ఫాదర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక పల్లోటి జూనియర్ కాలేజి నిర్వహించిన అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానవహ క్కులు పూర్తిస్థాయిలో అమలు జరగాలంటే మహిళలు, యువత చైతన్య వంతులు కావాలన్నారు. మానవహక్కుల సాధనకు కుల మత వర్గ విభేదాలు లేకుండా ప్రజలంతా ఐకమత్యంగా పోరాడలన్నారు. తొలుత పల్లోటి జూనియర్ కాలేజి నుంచి ప్రారంభమైన ర్యాలీ మానవహక్కులు కాపాడాలని నినాదాలు చేస్తూ సాగింది. మద్దూరు డౌన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీలో విద్యార్థులతో ఫాదర్ అల్లురెడ్డి, సిస్టర్ విన్నరసి, సిస్టర గ్రేసి, సిస్టర్ ప్రియ, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చేనేత విభాగం జాయింట్ సెక్రటరీగా సుబ్బారావు



మాచవరం: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన అవ్వారు సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర చేనేత విభాగ కమిటీని ఏర్పాటు చేశారు. గురజాల నియోజకవర్గం నుంచి సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి తనకు పార్టీ పదవిని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వామి వివేకానంద బోధనలను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల : ప్రపంచ వ్యాప్తంగా స్వామి వివేకానంద పలు బోధనలు చేసి భారతదేశాన్ని అనేక దశాబ్దాల కిందట మొదటి స్థానంలో నిలిపినట్లు పల్నాడు జిల్లా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. రామకృష్ణ మిషన్ స్థాపించిన సందర్భంగా పురస్కార నేపథ్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జాగృతి కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం షాకీనా, ఉపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ రవి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా అందించే వైద్య సేవలు ప్రజలకు వివరించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు చక్రవర్తి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పంట నష్టంపై అంచనాలు

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మిచాంగ్ తుఫాను కారణంగా వాటిల్లిన పంట నష్టంపై అంచనాలు రూపొందించే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 5,6 తేదిల్లో భారీ వర్షాలు కురిసి పంటలు నీట మునిగి అన్నదాతలు నష్టపోయారు. దీంతో ప్రభుత్వం చురుగ్గా పంటనష్టం వివరాలు అందించాలని అధికారులను ఆదేశించటంతో ఈ నెల 7 నుంచి ముమ్మరంగా నష్ట వివరాల నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 18తో నమోదు ప్రక్రియ ముగియనుంది. తుది వివరాలను ఈ నెల 22న ఆయా సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ అనంతరం జాబితాను డిస్‌ప్లే చేసి, మిగిలిపోయిన రైతులుంటే ఫిర్యాదుల ద్వారా వివరాలు నమోదు చేయనున్నారు. శనగ పంట సుమారు 600 హెక్టార్లు సాగుకాగా పూర్తిగా దెబ్బతింది. పొగాకు 60 హెక్టార్లు, వరి 5 హెక్టార్లు, కంది 6 హెక్టార్లు, మినుము 2 హె, మొక్కజొన్న, మిర్చి, పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. సంక్రాంతి నాటికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించే అవకాశం ఉందని ఏవో హరిప్రసాద్ తెలిపారు.

వికసిత భారత్‌పై ప్రజలకు అవగాహన

నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలని తహశీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు చెప్పారు. నాదెండ్ల, చిరుమామిళ్ళ గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల సమయంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటూ లబ్దిదారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్‌లు నాగలక్ష్మి, సింగారెడ్డి లక్ష్మీ, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, ఏవో హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు బీజేపీ జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, ఆరా శివకోటిరెడ్డి, నెల్లూరు రంజిత్, పిన్నింటి నాగేశ్వరరావు, సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు కేబీఆర్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: కాసు బ్రహ్మానందరెడ్డి విద్యాసంస్థల జూనియర్ కళాశాల విద్యార్థి షేక్.రోషన్‌జమీర్ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 12 నుంచి 14వతేది వరకు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రోషన్‌జమీర్ అండర్-19 డిస్కస్‌త్రో పోటీలో ద్వితీయస్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్టు వివరించారు. జాతీయస్థాయిలో ఈనెల 24, 25తేదీలలో మహారాష్ట్రలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీలలో రోషన్‌జమీర్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ఏ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్, అధ్యాపకులు జమీర్‌ను అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో లయోలా విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డిసెంబరు 12,13,14 తేదీల్లో నరసరావుపేటలోని కోడెల స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణానికి చెందిన లయోలా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రధానోపాధ్యాయులు ఫాదర్ రవి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పి.చాంద్‌వలి అండర్ -17 విభాగం షార్ట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించగా, ఆర్ తేజఅశ్విన్ అండర్ -17 విభాగం 400 మీటర్ల హడ్డిల్స్ పరుగుపందెంలో రాష్ట్రస్థాయిలో 3వ స్థానం కైవసం చేసుకున్నాడు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, కరస్పాండెంట్ ఫాదర్ జ్ఞానదేవన్, వార్డెన్ మరియా జోసెఫ్, ఫాదర్ జ్ఞానశేఖరన్, వ్యాయా ఉపాధ్యాయులు పి.యలమంద, బి.కొండలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సెల్‌ఫోన్‌లు పోతే వెంటనే ఫిర్యాదు చేయండి



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను లక్ష్మయ్యకు అందచేస్తున్న సీఐ బ్రహ్మం

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామి దర్శనానికి వచ్చి దేవాలయం సమీపంలో మాచర్లకు చెందిన అడ్డగిరి లక్ష్మయ్య సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ క్రమంలో లక్ష్మయ్య వెంటనే పూర్తి వివరాలతో అమరావతి పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగింది. సీఐ ఎ.వి.బ్రహ్మం ఆదేశాలతో ఇటీవల పోలీసుశాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను లక్ష్మయ్యకు అందజేయడం జరిగింది. సీఐ బ్రహ్మం మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పూర్తి వివరాలతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను కనుగొని సంబంధిత యజమానికి అప్పగిస్తామన్నారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన పెంచాలి



ముప్పాళ్ళ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ గీతాంజలి

ముప్పాళ్ళ: ఈ నెల 18 నుంచి అన్ని గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్యశ్రీ పై ప్రజలకు అవగాహన పెంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలకు, వైద్య సిబ్బందికి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా అందే సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన వారు కూడా బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ నుంచి చేపట్టాలన్నారు. అందుకు ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పీ రమాదేవి, జయకృష్ణ, సీహెచ్ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్‌లు పీటర్‌దానియేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ బ్రోచర్లను అందజేయాలి

రాజుపాలెం: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం పొందడం ఎలా అని ప్రజలకు తెలియజేయడం గురించి ఆరోగ్య సిబ్బందికి అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర కృష్ణకుమార్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి మండలంలోని అన్ని కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ బ్రోచర్లు అందజేయాలని తెలిపారు. అనంతరం బ్రోచర్లను సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉషారాణి, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన గేదె

మాచవరం: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కొట్టేళ్ల వాగు సమీపంలోని వరిపొలాల్లో చాలా రోజులు క్రితం విద్యుత్ స్తంభం విరిగిపోయింది. వరికోత అనంతరం పొలంలో గేదెలు మేపుకునేందుకు గ్రామానికి చెందిన పోకల ఆంజినేయులు, గంధం చిన్న ఆదెయ్యలు వెళ్లారు. విద్యుత్ స్థంబం వద్ద విద్యుత్ తీగలు తెగి పడి ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే రెండు గేదెలు మృతి చెందాయి. విషయాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయగా గతంలోనే విద్యుత్ సరఫరా నిలిపివేసామని, విద్యుత్ సరఫరా ఎలా వచ్చిందో తెలుసుకుంటామని అన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని బాధితులు తెలిపారు.

ఈ ప్రయాణం.. ప్రమాదం కదా!



నాదెండ్ల: గుంటూరు-గుంతకల్లు రైల్వే లైను డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటూ సాతులూరు వద్ద రైల్వే గేటును అధికారులు మూసివేశారు. ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు బోర్డు పెట్టారు. అయితే చందవరం నుంచి సాతులూరు గేటు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సాతులూరు, నరసరావుపేటలోని విద్యాలయాలకు చెందిన బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను తీసుకుని ప్రయాణిస్తుంటాయి. ప్రస్తుతం గేటు మూసివేయటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని ప్రమాదమని తెలిసినా రైల్వే గేటు దాటి పట్టాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆ సమయంలో ఏదైనా రైలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు చేసేలా చూడాలని అధికారులు సూచిస్తున్నారు.